క్లుప్తంగా

డీఈఓకు శుభాకాంక్షలు



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా నూతన విద్యా అధికారిగా బాధ్యతలు చేపట్టిన గోవిందరాజులును శుక్రవారం బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ విజయకుమార్, మధు వనపర్తిలోని వారి కార్యాలయంలో కలిసి మెమోంటోతో శుభాకాంక్షలు తెలిపారు.

చేవేళ్ల కోఆర్డినేటర్‌గా వెంకటేష్



పాన్‌గల్: చేవేళ్ల పార్లమెంట్ ఎల్ఎండీఎం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మండలంలోని కేతపల్లికి చెందిన ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్‌ను అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవేళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా తన వంతుగా కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, వేణుగోపాల్, దీపా దస్మున్సి, కొప్పుల రాజు, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు

ఆత్మకూర్: పట్టణంలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో ఇరుముడి మహోత్సవాన్ని శుక్రవారం గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాలధారులకు, భక్తులకు అన్నదానం (బిక్ష) ఏర్పాటు చేశారు. ఊరేగింపుగా పరమేశ్వరస్వామి చెరువు వరకు కాలినడకన దీక్షాపరులకు సాగనంపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు అనిల్, గాడి లక్ష్మణ్, హర్షగౌడ్, తోట రవి, చందుగౌడ్, గోవర్దన్, శ్యాంసుందర్‌రెడ్డి, నరేందర్, శ్రీకాంత్, నాని, దీక్షాపరులు పాల్గొన్నారు.

రెండో రోజు నిరసన



అమరచింత: ఉమ్మడి ఇంట్లో తనకు వాటా కావాలని అన్న నసీర్ ఇంటి ఎదుట తమ్ముడు నిస్సార్ రెండో రోజు నిరసన కొనసాగించారు. వీరికి గతంలో ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని బీసీ కాలనీలో కేటాయించారు. తండ్రి బుక్కు బడేసాబ్ పేరున ఇంటి స్థల పత్రాలు అందించారు. సామూహికంగా ఇంటిని నిర్మించుకున్నామని, ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న అన్న నసీర్ తనకు వాటా ఇవ్వడం లేదని నిస్సార్ తన అన్నతో వాదించారు. ఇల్లు తన పేరున లేదని తన కుమారుడి పేరున ఉందని తన అన్న చెప్పడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో భార్యతో కలిసి రెండో రోజు అన్న ఇంటి ఎదుట పొయ్యి పెట్టి నిరసన వ్యక్తం చేశారు.

రాయితీని వినియోగించుకోండి



వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం వాహనదారులకు కల్పించిన పెండింగ్ చలాన్ల బకాయి రుసుముల రాయితీలను వినియోగించుకోవాలని ఏఎస్‌ఐ చంద్రారెడ్డి వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గోవర్ధనగిరి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం వాహన బకాయిల చెల్లింపులను పూర్తి చేసుకోవాలని, లేకుంటే రాయితీని కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు అశోక్, సురేష్, హోంగార్డు ధర్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన దాసరి బిచ్చన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి శుక్రవారం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, కాంగ్రెస్ మత్స్యకారుల కమిటీ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, మండల అధ్యక్షుడు రాములుయాదవ్, కుమ్మరి గోవిందు, నాయకులు విష్ణు, రామచంద్రయ్య, మదిలేటి, గంగాధర్, నరసింహ, దిలీప్, అరవింద్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

భూములను కాపాడుకుందాం

- బాధితులకు పరిహారం
- సంత భూమిపై మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మాణం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ, దేవాదాయ భూములను కాపాడుకోవాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, లోకల్ బాడీ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో తమ వార్డుల్లో ఏం అభివృద్ధి జరగలేదని వాపోయారు. విద్యుత్ సమస్యలు, డ్రెయినేజీ నిర్మాణం, రోడ్డు విస్తరణ వంటి సమస్యలు వేధిస్తున్నాయని సభ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్, చైర్‌పర్సన్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో ఇళ్లు, షాపులు, చిరు వ్యాపారాలను కోల్పోయిన బాధితులందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మున్సిపల్ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకుందామని సూచించారు.

కౌన్సిలర్ల ఆందోళన

గతంలో ఆలయానికి సంబంధించిన 30 ఎకరాల భూమిని పూజారి పేరు మీద పట్టా చేశారని, దానిని తిరిగి ఆలయం పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత భూమి విషయంలో కౌన్సిల్‌లో ప్రత్యేక తీర్మాణం చేయాలన్నారు. ఆలయ కమిటీకి, మున్సిపల్ సభ్యులకు మధ్య సమన్వయం లేకపోవడంతో దళారులు ప్రవేశించడం ద్వారానే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. తొందర్లో దీనిపై సమావేశం నిర్వహించి అందరి తీర్మాణం మేరకు చర్యలు తీసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, తహసీల్దార్ లక్ష్మి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు కాంగ్రెస్ ప్రభుత్వం



జయమ్మను సన్మానిస్తున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మంత్రి చిన్నారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సేవాదళ్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన జయమ్మను శుక్రవారం డీసీసీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రజా పాలన చేపట్టారని, ప్రతి అర్హుడికి న్యాయం చేసే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటుగా వనపర్తి ప్రగతిపథంలో ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకొని ప్రజల మన్ననలు పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, మత్స్యకార అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి సయ్యద్ అక్తర్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు అనీస్, నాయకులు కృష్ణ, ఖమర్‌మియ్యా, వెంకటేష్, సమద్, జానకీరాములు, పెంటన్న, బాబా, ఎల్లయ్య, రాగి అక్షయ్, నరసింహ, సత్యారెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వనపర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాము అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వికసిత్ భారత సంకల్పయాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు యాదగిరి, పట్టణ అధ్యక్షుడు దేవరాజు, యువజన సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అక్షితలు పంపిణీ



పెబ్బేరు రూరల్: అయోధ్య రాములవారి అక్షింతలకు మండలంలోని సూగూరులో శుక్రవారం రామాలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా వెళ్తూ ప్రతి ఇంటికి అక్షింతలతో పాటు ఫొటో, కరపత్రాన్ని పంపిణీ చేశారు. సర్పంచ్ వెంకటస్వామి, శ్రీవారి వెంకటేశ్వర్లు, మాధవుడు ఉన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఊరేగింపు



ఆంజనేయస్వామి ఊరేగింపు చేస్తున్న భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఆంజనేయస్వామి, రాములోరి విగ్రహ ఊరేగింపు, పల్లకీ సేవా కార్యక్రమాలను మాలధారులు ఘనంగా నిర్వహించారు. బెస్తగేరి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఆంజనేయస్వామి, శ్రీరాముల వారి విగ్రహాల పల్లకీ సేవను బస్టాండు మీదుగా గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు చేశారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువకులు ఆంజనేయస్వామి మాలధారణ ధరించడం ఆనవాయితీగా వస్తుంది. ఊరేగింపు సందర్భంగా మాలధారులు, భక్తులు భజన చేస్తూ భక్తిగీతాలు ఆలపించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు నివాళి

వనపర్తి టౌన్: దోపిడి వాదుల గుండెల్లో అగ్ని రగిలించి, అక్షర బాణాన్ని వదిలిన ఘనుడు అలిశెట్టి ప్రభాకర్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ ప్రకాశ్ అలిశెట్టి ప్రభాకర్ పోరాటాలను, జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో గిరి రాజాచారి, నరసింహాశర్మ, నాగరాజు, కావలి బాలస్వామి నాయుడు, బాలేమియా, పానుగంటి యోసేపు, మిద్దె నాగేష్, రాబర్ట్, రవి పాల్గొన్నారు.

14 నుంచి తిరుమలయ్యగుట్ట బ్రహ్మోత్సవాలు



తిర్మలయ్య స్వామివారి ఆలయం

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి శివారులోని తిర్మలయ్య గుట్టపై వెలిసిన పద్మావతి, అలవేలుమంగ సమేత వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఇందిర తిర్మలేష్, ఎంపీటీసీ సభ్యుడు ఓమేష్, గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. హోమాలు, భోజన వసతి తదితర పూజలు మొదటి రోజు జరుగుతాయన్నారు. సోమవారం స్వామి వారికి అభిషేకం, సత్యనారాయణ వ్రతం తదితర పూజలు నిర్వహించడంతో పాటుగా సాయంత్రం వివిధ గ్రామాల నుంచి వచ్చే ఎద్దుల బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు గుట్టపై జాతర జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని సర్పంచు తెలిపారు.

రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఎన్నిక

కొత్తకోట: కొత్తకోట, మదనాపురం మండలాలకు చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్లు శుక్రవారం అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌టీడీ వెంకటేష్, గంగు వెంకటరెడ్డి, వెంకటన్న గౌడ్, అధ్యక్షుడిగా పెంటన్నయాదవ్, ఉపాధ్యక్షుడిగా దాసరి రమేష్, కార్యదర్శిగా కొన్నూర్ రవి, కోశాధికారిగా చీర్ల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

వివేకానంద ఆశయాలు కొనసాగిద్దాం



కనిమెట్టలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: నేటి యువత స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్తకోట మండలంలోని కనిమెట్ట, ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లిలో, శ్రీరంగాపురం మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, సీడీసీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి, తహసీల్దార్ మురళీగౌడ్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీఓ రాజు, ఆర్‌ఐ రాధాకృష్ణ, సర్పంచ్‌లు గాదం రాణి, నర్సింహారెడ్డి, వినీలారాణి కోఆప్షన్ సభ్యులు అల్లబాషు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.



నాగసానిపల్లిలో..



ఆత్మకూర్‌లో..



ఆరేపల్లిలో..



శ్రీరంగాపురంలో..



వనపర్తిలో..



అమరచింతలో..



కొత్తకోటలో..



ఖిల్లాఘనపురంలో..

హిందూవాహిని ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: హిందూవాహిని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వివేకానందుడి విగ్రహం వద్ద నిర్వహించారు. హిందూవాహిని మహిళా విభాగం జిల్లా కన్వీనర్ మమతజార్జిరెడ్డి జెండా అవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడని కొనియాడారు. అదే విధంగా ఏబీవీపీ ఆధ్వర్యంలోనూ వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ అభిలాష్‌హౌదేకర్, జిల్లా కన్వీనర్ అరుణ్, కోకన్వీనర్ అరవింద్, హర్ష, పట్టణ కన్వీనర్ రోహిత్, ఏబీవీపీ ప్రతినిధులు బాలకృష్ణ, కేదార్‌నాథ్, అరవింద్, దేవిప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



సింగంపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ జగన్మోహన్



రేమద్దులలో..

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు స్నేహభావంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్‌ఐ జగన్మోహన్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సింగంపేటలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో మెలగాలని కోరారు. మొదటి బహుమతి రూ.8వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.4 వేలు, నాల్గో బహుమతి రూ.2 వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందిస్తున్నట్లు నిర్వాహకులు నారాయణ తెలిపారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో శుక్రవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నాయకులు ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పండుగ సందర్భంగా క్రీడలను నిర్వహిస్తునట్లు ఆయన పేర్కొన్నారు. క్రీడల నిర్వహణతో స్నేహభావం పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, భగత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



పాన్‌గల్ ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు నమోదుచేస్తున్న ఆపరేటర్లు

పాన్‌గల్: ఆరు గ్యారంటీల పథకాల అమలు కోసం ప్రజల నుంచి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం శుక్రవారం మండలంలో కొనసాగుతున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు తెలిపారు. మండలంలోని 28 పంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 9వేల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నమోదు వివరాలను వేగవంతంగా నమోదు చేసేలా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాలతో పాటు మీసేవా కేంద్రాలల్లో వివరాల నమోదు కొనసాగుతుందన్నారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆపరేటర్లకు సూచించామన్నారు. ఆయా వివరాలను ఈనెల 17వ తేదీ వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నమోదు వివరాలను మండల ప్రత్యేకాధికారి రహెమాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, డీటీ అశోక్‌నాయుడు పర్యవేక్షిస్తున్నారు.

ముగ్గుల పోటీలు



ఆత్మకూర్‌లో..



వనపర్తిలో..

వనపర్తి: జిల్లా కేంద్రంలోని మదర్స్‌లాప్ హైస్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పతంగుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ముబీన్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పండుగలు జరుపుకోవడానికి వెనుక ఉన్న ఆచార వ్యవహారాలు వివరించామన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు అలరించాయి. విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ టీజే విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ గంగాధర్ బహుమతులను అందజేశారు.

టీబీపై అవగాహన



పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, వనపర్తి ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో టీబీ నివారణ, ఆడ పిల్లల సంరక్షణ అనే అంశాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందంచే ప్రజలకు అవగాహన కల్పించారు. కళా బృందం తమ ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచారు. డా.రాకేష్‌రెడ్డి, రాజశేఖర్, కౌన్సిలర్ అక్కమ్మ, గంధం ఉత్తమ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

యువత ఆర్థికంగా రాణించాలి

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకంలో భాగంగా రుణాలు పొంది వ్యాపారులు, నిరుద్యోగులు ఆర్థికంగా రాణించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహ్మద్ అబ్బాస్ అలీ, ఫీల్డ్ ఆఫీసర్ మదన్‌మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో మూడో రోజు ముద్ర రుణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణం కావల్సిన వారు ముద్ర రుణ దరఖాస్తు పత్రం, ఆధార్, పాన్‌కార్డు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం, వ్యాపార అనుమతి లేదా నమోదుపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వార్షిక ఆదాయ పన్ను రిటర్న్ పత్రాలను తీసుకురావాలని సూచించారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జూపల్లి యువసేన ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి ఓపెన్ టు ఆల్ (జాతీయ స్థాయి) వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆన్మగళ్ల విష్ణు తెలిపారు. ఆసక్తి గల క్రీడా జట్లు తమ పేర్లను ఈనెల 13వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ. 50 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు నగదుతో పాటు షీల్డ్‌లను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఓపెన్ టు ఆల్ మహిళల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డులను అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నెం .99487 32374, 98485 32568, 86883 47858, 95507 82323ను సంప్రదించాలన్నారు.